
# విధివిధానం

## మధురాంతకం రాజారాం

తండ్రి లేని లోటు తీరింది. అయినా కన్నతల్లి తండ్రులు ఎవరో తెలియక పోవడం నిజంగా రంపపు కోత. దానితోనూ సరి పెట్టుకొన్నాడు అతడు. ప్రేమించిన సుదతిని వివాహం చేసుకున్నాడు. అది శోభనం రోజు. జన్మ రహస్యం బహిర్గతం కావడానికి ఆ రోజే ఎన్నుకొన్నది. అది ఏలాంటి భయంకరమైన పరిణామానికి దారి తీస్తుందో తెలుసుకొనడానికి అతనికి మార్గమూ లేదు.



"ముడిచిన పువ్వులు విడిపోగూడదు. అల్లిక బిగువు సడలి పోగూడదు. జడ బడలినకొద్దీ, పువ్వులు నలిగిన కొద్దీ గది గదంతా సువాసనలతో ఘుమాయించాలి. . ."

ముక్కాలిపీటపైన కూర్చున్న వైదేహికి జడల్లుతున్న పెద్ద ముత్తయిదువ పనిలో పనిగా తన కళాకౌశలాన్ని గురించి చెప్పుకుంటూంది.

వెండి ప్రమిదెల్లో సంధ్యా దీపాలు వెలుగుతున్నాయి. దారబంధాల్లో పచ్చని మామిడాకుల తోరణాలు రెప రెప లాడుతున్నాయి. నడవలోనుంచి ఐదువరాండ్ర పరిహాసాలు, కన్నె పడుచుల సరాగాలు కమ్మతావిగాలా వ్యాపిస్తున్నాయి.

వైదేహిని విభునికోసం సింగారిస్తున్నారు.

"అక్కయ్యా, అక్కయ్యా !" తడవకు రెండేసి మెట్లు చొప్పున దిగి, తుపానులా వచ్చిపడింది అరవింద. "మేడపైన గోడ గడియారం నిలిచిపోయింది. కీ యిద్దువుగానీ రావా అక్కయ్యా !"



"వూరుకోవే అరవిందా ! నీకు మరేం పనీ పాటా లేదు. . ." తెచ్చికోలు కోపం ప్రదర్శించింది వైదేహి.

మళ్లీ మళ్లీ తన పథకం తల్లక్రిందులై పోతున్నందుకు అరవింద ముఖం చిన్నబోయింది. ఆ పిల్ల మధ్యాహ్నంనుంచీ అక్కకూ, బావకూ హితాత్సమాగం సంఘటింప జేయాలని శాయ శక్తులా ప్రయత్నిస్తూంది. అందుకు కారణం హఠాత్తుగా బావగారితో తారసిల్లినపుడు బుగ్గలు ఎరుపెక్కి అడుగు ముందుకు పడక బెదరిన హరిణంలా తటాలున వెనుదిరిగి వస్తుండగా అక్కయ్యను వేళాకోళం చేయాలన్న సదుద్దేశం తప్పితే మరేమీ కాదు. అరవింద ఉద్దేశ్యం ఇప్పుడిప్పుడే ఈడేరే సూచనలు లేవు. ఎన్ని కారణాలు కల్పించి చెబుతున్నా అక్కయ్య మేడపైకి రావడం లేదు. ఇక బావగారేమో మేడపైన గదిలో వాలు కుర్చీలో మేనువాల్చి యోగనిష్ఠాగరిష్ఠుడికి మల్లే పుస్తకపఠనంలో నిమగ్నుడై వున్నాడు..

అరవిందకు కొత్త ఉపాయా లేవీ స్ఫురించడం లేదు. .

ఇంతలో జడవేయడం పూర్తి కావచ్చింది. "లేచి నిల్చుని జడను చూచుకోవే వైదేహీ ! మావన్నీ పాతకాలంనాటి ముస్తాబులు మీకు నరిపడుతుందో, సరిపడదో మరి ! ఆ విషయం తీరిగా తేల్చుకోవచ్చుగానీ నువ్వెళ్ళి తొందరగా ముఖం కడుక్కొని రావాలి. తిలకం అమిరిస్తే గానీ నా పని పూర్తి కాదు. . " పెద్ద ముత్తయిదువ వేగిరిస్తూంది.

అవకాశాన్ని చప్పున పసిగట్టేసింది అరవింద. గబగబా మేడ మెట్లెక్కింది. "నీకో విచిత్రం చూపించమంటావా బావా ! చూద్దువు గానీ రా" అంటూ శేఖరం చేతుల్లోని పుస్తకాన్ని మూసేసింది.

"ఏమిటబ్బా అంతటి విచిత్రం !" విస్మయాన్ని ప్రకటిస్తూ శేఖరం లేచి నిల్చున్నాడు.

అరవింద శేఖరాన్ని ద్వారం దాటించి డాబాపైన పిట్టగోడదాకా లాక్కొచ్చింది.

నాలుగు గోడలమధ్యనుంచి బయట పడగానే శేఖరం ఆకసం వైపు చూశాడు. దూదిపింజంలాంటి తెల్లటి మబ్బులు వినీల కాసారంలో అల్లితామరపువ్వుల్లా శోభిస్తున్నాయి. పిట్టగోడకానుకుంటూ శేఖరం పెరటిలోని జామిచెట్టు వైపు చూశాడు. అనుపానంగా తీయటి జామపండును పంజుకుంటూ చిలుకా గోరువంకా సరసా లాడుతున్నాయి. శేఖరం క్రిందికి చూశాడు. నూతిపళ్లెం దగ్గర ముఖం కడుక్కుంటూ వుంది వైదేహి. అంధకారానికి పూర్వ రంగంగా లోకాన్ని ఓ వెలుగు వెలిగించిపోవడానికి వచ్చిన సంధ్యారాగం వైదేహిపై వసంతాలు చల్లుతూంది!

చూచినపాటున శేఖరం వైదేహిని పోల్చుకో లేకపోయాడు. పెళ్లినాటి సింగారం వైదేహికింతగా మెరుగులుదిద్ది తన కళ్లను మోసగించినందుకు శేఖరం ఆశ్చర్య పడ్డాడు గూడా ! శారీరకమైన వన్నెచిన్నెలకు ప్రలోభపడి సహధర్మిణిని ఎన్నుకోడం శుద్ధ అవివేకమని శేఖరం విశ్వసించేవాడు. ఆకాశాని కెలాగైతే హద్దులు లేవో, అలాగే అందానికి అవధులు సైతం లేవు. 'అందాన్ని కొరుక్కుతింటామా? అంటూ నిత్య జీవితంలో వినిపించే మాట వట్టి చాదస్తపు మాట కాదు. అందులో పరమార్థం లేకపోలేదు. చెట్టపట్టాలు వేసుకొని పలుకు దోడుగా, తోడునీడగా తన వెంట రాగల అర్థాంగిలో మగవాడికి కావలసిన వాటిలో మొదటిది ఆత్మీయత. రెండోది అనురాగం. శేఖరం వైదేహి నీలికళ్లలో అచ్చమైన అమాయకత్వాన్ని చూచాడు. ఆమె పలుకులో తన హృదయ వీణను మ్రోగించే దివ్యనాదాలు విన్నాడు. ఆమె చిరునవ్వుల సిరులలో తన బ్రతుకు వాడిపోని పువ్వులతోట కాగలదనుకున్నాడు. అందాన్నిగాదు, శేఖరం ఆత్మ సౌందర్యాన్ని ప్రేమించాడు. శేఖరానికి ఐశ్వర్యం వుంది. ప్రాణాధికంగా చూచుకొనే నాన్నగారున్నారు. కాని జీవితంలో అతడి వూహకందని వెలితి ఏదో ఉండిపోయింది. వైదేహి సాన్నిధ్యంలో ఆ వెలితి పూరింపబడినట్లు, జీవితానికి అర్థమూ, సార్థక్యమూ లభించినట్లు శేఖరం భావించాడు.

జన్మజన్మాల అనుబంధమని పెద్దలు

మనోహకమాట కూడా చెప్పుతుంటారు ! కాక పోతే కాలేజి విద్యార్థుల్లో ఎందరో రచయితలుండగా వైదేహి కొత్తపాటలకోసం శేఖరాన్నెందుకు అర్థిస్తుంది ? అర్థించిందిపో, ఏవో కథలు నాటికలు వ్రాసుకునే శేఖరం గేయాలు వ్రాయడానికెందుకు పూనుకున్నాడు ! పూనుకున్నాడుపో, గాయకురాలి పాటల్లో కవి హృదయం అంతా నికరంగా ఎలా ప్రతిధ్వనిస్తుంది ? పంచమస్వరంలాంటి తీయటి కంఠం భగవంతుడు వైదేహికిచ్చిన వరం. ఇదివరకు తన అనుభవానికి లోనుగాని అనిర్వచనీయ మధురానుభూతులెన్నో యీ ప్రపంచంలో కొల్లలు కొల్లలుగా నిక్షిప్తమై వున్నాయన్న సత్యం వైదేహి పాటనువింటుండగా శేఖరానికి స్ఫురించింది!

పిట్ట గోడ కానున్నా శేఖరంలో చలనం లేదు. శేఖరం వైదేహిని పిలవగలడనీ, లేదా వైదేహి తలపైకెత్తి మేడవైపు చూస్తుందనీ వేచి చూస్తూంది అరవింద. నిమిషాలు గడచి పోతున్నాయి గానీ, శేఖరం పిలవడం లేదు. ఎంత సేపు ముఖాన్ని అరగదీస్తుందో గానీ వైదేహి తల పైకెత్తడం లేదు. ఆఖరికి విసుగెత్తి పోయి "అక్కయ్యా ! ఇలా చూడు. ఇదిగో ఇక్కడ, మిద్దెపైన" అంటూ కేకపెట్టింది. అరవింద.

వైదేహి తల పైకెత్తింది. అరవింద చిలిపి నవ్వులు నవ్వుతూంది. శేఖరం కళ్లల్లో కొంటెనవ్వులు సుళ్లు తిరుగుతున్నాయి. వైదేహి గూడా ఆ నవ్వులతో శ్రుతి కలుపబోయింది. కానీ అంతలో సిగ్గుపడిపోయి దివ్వెలు వెలుగుతున్న గాలిగోపురంలా భావిస్తూ వెనక్కు లాగుతున్న జడను వక్షంపైకి సవరించుకుంటూ తుర్రున ఇంటిలోపలికి పారిపోయింది.

చెంగు పట్టుకోగా కరిగిపోయిన కిన్నెరసానిలా, చూపుకందినా అందినట్లే జారిపోయింది వైదేహి. శేఖరాని కాక్షణాన అరవిందపైన కోపం వచ్చినమాట వాస్తవం !

"కాఫీ చల్లారిపోతూంది శేఖరం !" గదిలో ద్వారందగ్గర నిల్చున్న అత్తయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ పిలుస్తోంది.

అత్తయ్య తన కొంటెతనాన్ని పసిగట్టినందుకు శేఖరం కించపడిపోయాడు. ఐనా అంతలో తేరుకుని "వాళ్ల వాళ్ల గొడవల్లోపడి బంధుమిత్రులందరూ నన్ను మరచిపోయినా నువ్వుమాత్రం మరిచేటట్టు లేవత్తయ్యా !" అంటూ కాఫీ గ్లాసు చేతికి తీసుకున్నాడు.

"మరేం భయపడకు శేఖరం ! ప్రొద్దుపోతూ పోతూ వుండగా కాఫీ త్రాగే దురలవాటొకటి నీకుందని నేను వైదేహితో చెబుతాలే !" నవ్వుతూ వెళ్లిపోయింది అత్తయ్య.

# విధి విధానం

శేఖరం కుర్చీలో కూర్చున్నాడు. మళ్లీ పుస్తకం తెరిచాడు. కానీ ఎంతగా ప్రయత్నించినా బుద్ధి పుస్తకంపైన నిలవడంలేదు. అందుకు శేఖరాన్ని తప్పుపట్టడంగూడా న్యాయంగాదు. పడుచువాని గుండె పాలకుండలాంటిది. వేడితగిలిందేమో, పాలు పొంగింది. మరేం ప్రమాదంలేదు. కాస్త మంచినీళ్లు చల్లితే పొంగు తగ్గిపోతుంది. చల్లటి గాలిలో కాసేపు షికారుతిరిగి రాదలచుకుని మెట్లు దిగసాగాడు శేఖరం.

మెట్లు దిగి శేఖరం వసారాలోకి వచ్చాడు. రెండు మూడు నిమిషాల్లో మేడను పరివేష్టించి వున్న తోటను దాటుకుని వీధిలోకి వెళ్లిపోయివుండేవాడే శేఖరం ! కానీ అంతలో తోటలోనుంచి పరుగు పరుగునా పరతెంచి వస్తున్న కుర్రాడొకడు శేఖరానికి కనిపించాడు. గసపోసుకుంటూ వసారాలోకి వచ్చిన ఆ కుర్రవాడు "మీ నాన్నగారికి గుండెపోటు వచ్చిందట బావా ! మెల్లగా నడిపించుకొస్తున్నారు. నీతో చెబుదామని పరుగెత్తొస్తున్నాను" అన్నాడు.

ముఖం వెల వెల పోతుండగా శేఖరం ఎక్కడైతే నిల్చున్నాడో అక్కడే ప్రాన్పడి పోయాడు.

ప్రాన్పడిపోక శేఖరం మరేంచేయుగలడు ! నాన్నగారికి గుండెజబ్బున్నమాట నిజమే ! చెప్పకుండా, పెట్టకుండా వూడిపడి, వున్నంత కాలం ధాంధూములు చేసివెళ్లే అతిథిలా అది అప్పుడప్పుడూ నాన్నగారిని పరామర్శించి వెళ్తున్నమాట గూడా యథార్థమే ! ఐతే మాత్రం ? అమృతపాత్ర పెదవి కందించి అదృశ్య హస్తాలతో గొంతుక నొక్కి ఎలా త్రాగగలవో చూడాలి తమాషా అంటూ తనతో చెలగాటమాడుతుందా విధి !

తనీ రోజున శోభనపు పెళ్లికొడుకు ! నాన్నగారు నాలుగు కాలాలపాటు ఆరోగ్యంగా వుండకపోతే తనకేం శోభనం ! అయ్యో, విధి ఇలా పరిశోధించడానికి తనేం పాపం చేశాడు ?

ఆలోచనలు తెమలకమునుపే, అడుగు కదలకమునుపే శేఖరానికి కోదండరామయ్యగారు ప్రత్యక్షమయ్యారు. ఎలా ప్రత్యక్షమయ్యారు? ఈవలావల ఇద్దరు పెద్దమనుషులు ఊతనిచ్చి ఆయనను నడిపిస్తున్నారు. ఆయన ముఖం నల్లబడిపోయిందని చెబితే చాలదు. బ్లాటింగుపేపరుపెట్టి జీవకళను పూర్తిగా పీల్చివేసినట్టుగా అది వివర్ణమైపోయింది. ఒడలిపైన గుప్పు గుప్పున స్వేదబిందువులు పొటమరిస్తున్నాయి. ఇవన్నీ రోగ చిహ్నాలని సరిపెట్టుకోడానికి సైతం వీలుండటంలేదు. ఆయన హృదయవిదారకమైన దారుణ దృశ్యాన్ని చూచి భయావిష్టుడై మతి గోల్పోయినవాడిలా వున్నాడు !

"ఎలా వుంది నాన్నా ?" అంటూ పలకరించాడు శేఖరం.

శేఖరం మాటలు కోదండరామయ్యగారికి వినిపించినట్టేలేదు. అసలాయనకు ఈ లోకంలో తోడి మానవుల మధ్య సంచరిస్తున్నామన్న స్పృహే వున్నట్టులేదు. అలాగే ఆయనను గదిలోపలికి తీసుకెళ్లారు. మంచం పైన పడుకోబెట్టారు.

ఒక్క నిమిషంలో పెళ్లివారిల్లు విషాదానికి విడిదిగా మారిపోయింది.

శేఖరం వేడిగా నిట్టూర్చాడు . . .

రహదారిలో మిట్టపల్లాల్లాగే బ్రతుకు బాటలో గూడా సుఖదుఃఖాలు తప్పవు. కష్టమో, నష్టమో ఏది వచ్చినా పడాలి, లేవాలి. ముందుకు సాగిపోతుండాలి. తనను తానే సంబాళించుకుని తక్షణ కర్తవ్యంలోకి జొరబడ్డాడు శేఖరం. గదిలో రోగిచుట్టూ క్రిక్కిరిసిన బంధువులను దయచేసి బయటికి వెళ్లిపొమ్మన్నాడు. డాక్టరుగారికోసం మనిషి వెళ్లిందీ, లేనిదీ విచారించాడు. కిటికీలు తెరిచి, తలుపును ఓరవాకిలిగా వేసి బయటికి వచ్చాడు.

పానకంలో పుడకలాంటి ఈ సంఘటన తాకిడికి దిగాలుపడిపోయిన జగన్నాథంగారు ద్వారానికి అల్లంతదూరంలో ఖిన్నులై కూర్చుని వున్నారు.

"మరేం కంగారుపడవలసిన అవసరం లేదనుకుంటాను. నాన్నగారి కిది పది పన్నెండేళ్ల నుంచీ వున్న జబ్బే ! లేదంటే ఈసారి కాస్త ఉధృతంగా వచ్చినట్టుంది" అన్నాడు శేఖరం.

"ఏమిటో నాయనా ! పెళ్లంతా లక్షణంగా జరిగిపోయింది. ఈ అపశ్రుతి లేకుంటే బాగుండేది" అన్నారు జగన్నాథం గారు.

ఇరవై సంవత్సరాలుగా ఇద్దరు రాజకీయ నాయకులకు సరిగా మాటలులేవు. ఎప్పుడూ దెబ్బలాడుకుంటూ వుండేవారు. మూడో వ్యక్తి ఒకాయన యిద్దరికీ రాజీ చేద్దామని విందు ఏర్పాటు చేశాడు.

"ఇకమీదట ఇద్దరూ స్నేహంగా వుండండి" అన్నాడు ఆయన.

"అలాగే—వచ్చే ఎన్నికల్లో నాకు సపోర్టు చేస్తానని వారు మాట యిస్తే" అన్నాడు రాజకీయ నాయకులలో ఒకడు.

"ఇందుకు మీరు మాత్రం ఏంచేయగలరు? ఈ జబ్బు కొత్త కొత్త వైద్య ప్రక్రియలకుగూడా లొంగటంలేదు. ఎప్పుడొస్తుందో వూహించలేము. ఎంతసేపుంటుందో చెప్పలేము . . ."

"నిజమే నాయనా నిజమే! తోటలో వేపచెట్టు క్రింద కూర్చుని ఆయనా నేనూ ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. మనిషిలో ఆవగింజంత అనారోగ్యపు సూచనైనా లేదు. నేను నా స్వవిషయాలను ఏకరువు పెడుతుండగా, ఆయన ఎంతో ఆసక్తిగా వింటున్నారు. . ."

శేఖరం తటాలున మామగారికి అడ్డు తగిలి "మీరు మరేమీ అనుకోకపోతే నేనొక మాట చెబుతాను" అన్నాడు.

జగన్నాథంగారు విచలితులైపోయి "అనుకోడ మెందుకూ! చెప్పు బాబూ చెప్పు" అన్నారు.

"మరేంలేదు. మనసుకు బాధ కలిగించే మాటనుగానీ, హృదయానికి ఆఘాతం కలిగించే వార్తనుగానీ విన్నప్పుడు హఠాత్తుగా గుండెపోటు రావచ్చని డాక్టర్లు చెబుతారు..."

"అబ్బే! ఆయన మనస్సును నొప్పించడానికి నే నేమైనా మూర్ఖుడినా శేఖరం? ఇంతకూ నేను చెబుతున్న విషయం ఆయనకు సంబంధించి దేమీ గాదు. అదంతా నా వ్యక్తిగతమైన గొడవ. పాతికేళ్లనాడు మా కుటుంబంలో జరిగిన దుర్ఘటనను గురించి చెబుతున్నాను..."

శేఖరానికి తనపట్ల కలిగిన అపోహను తొలగించుకో దలచుకున్నారేమో, జగన్నాథంగారు ఆ దుర్ఘటన ఏమిటో మళ్లీ ఏకరువు పెట్టసాగారు: "పెళ్లయిన తరువాత అయిదారేళ్లవరకూ మాకు బిడ్డల్లేరు. సంతానం కలిగితే బిడ్డకు ఇరవై కాసుల బంగారంతో నగలు చేయించి, సన్నిధికి వచ్చి నిలువు దోపిడీ యిచ్చుకుంటామని వేంకటాచలపతికి మ్రొక్కుకున్నాము. మ్రొక్కుబడికి తలంపు చేసుకున్న రెండు మాసాలకే గర్భం నిలిచింది. పనసపండులాంటి మగబిడ్డ కలిగాడు. ఏడుకొండల వాడి విషయంలో ఆడిన మాట తప్పడానికి వీలుందా శేఖరం! అది జరగడానికే వీల్లేని విషయం. సరే, నేనూ మా ఆవిడా బిడ్డను తీసుకుని చేతిపనీ కాలిపనీచేసి పెట్టడానికి ఓ పనిమనిషిని వెంటబెట్టుకొని యాత్రకుబయల్దేరాము. రథసప్తమినాటికల్లా ఎగువ తిరుపతిలో వుండాలని మా నిర్ణయం. కానీ అవి వానకాలపు రోజులు. దిగువ తిరుపతిలో మేము రైలు దిగేసరికి కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ రోజుల్లో యిప్పుడున్నట్టుగా కొండపైకి రోడ్డు లేదు. మెట్లెక్కి వెళ్తే వెళ్లినట్టు. లేదా నాలుగో, అయిదో యిచ్చుకొని డోలీలో ప్రయాణంచేస్తే చేసినట్టు. దేనికైనా బిడ్డతో సహా వానలో తడవలేము గదా! అందుకని గోవిందరాజుల గుడికి దగ్గరగా ఓ సత్రంలో మకాము చేశాము...."

జగన్నాథంగారు వేడిగా నిట్టూర్చి మళ్లీ చెప్పసాగారు: "ఆనాడే రథసప్తమి. ప్రొద్దుపోయి చీకటిపడుతోంది. అప్పటికే బిడ్డకు జలుబుచేసింది. వూయల్లో వేసి వూచగా వూచగా నిద్రపోతున్నాడు. ఉదయంనుంచీ తెరపిలేకుండా కురిసిన వానగూడా అప్పుడే వెలిసింది. ఆ వ్యవధిలో గోవిందరాజుల దర్శనం చేసుకుని రాదలచుకున్నాము. పని మనిషిని బిడ్డ దగ్గర కాపలాపెట్టి నేనూ, మా ఆవిడా గుడికి వెళ్లిపోయాము..."

కనుగొనల్లో నిలచిన అశ్రుబిందువుల్ని అంగవస్త్రంతో తుడుచుకుంటూ అన్నారు జగన్నాథం గారు: "తిరిగి వచ్చేసరికి వూయల్లో బిడ్డ లేడు!"

"ఏమయ్యాడు?" ఆతురతగా ప్రశ్నించాడు శేఖరం.

"రోడ్డులో ఏదో అలజడి వినిపించేసరికి పని మనిషి వీధిగుమ్మంలోకి వెళ్లి నిల్చుంది. తిరిగి గదిలోకి వెళ్లేసరికి వూయల ఖాళీగా వుంది. మేము వెళ్లేసరికి పనిమనిషి లబోదిబో మని నెత్తీ నోరూ బాదుకుంటూ ఏడుస్తోంది. నాకంటే దురదృష్టవంతు డెక్కడైనా వుంటాడా శేఖరం! నగల కాశపడి ఎవరో బిడ్డను తస్కరించారు. పోలీసులకు రిపోర్టు చేశాను. పత్రికల్లో ప్రకటనలు వేయించాను. కానీ ప్రయోజనం లేకపోయింది..."

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి.

"ఎంత లేతమనసో ఏమిటో, ఈ గాథ నిందాకా చెప్పుకొచ్చేసరికి మీ నాన్నగారు తల వాల్చేశారు. కుయ్యోమని కేక పెట్టారు. నే నాపాదమస్తకం గడగడ వణికిపోయాను. అరవడానికి నోరు పెకలింది గాదు. ఇంతలోనే మనవాళ్లు కొందరు అక్కడ ప్రోగైపోయారు..."

శేఖరం అంతరంగంలో ఏదో భయం సన్నటి ధూమ రేఖలా అంకురించింది. కొన్నిక్షణాల్లో అతడి మానసాకాశమంతటా పొగ మబ్బులు క్రమ్ముకున్నాయి. ఈ పొగ మబ్బులన్నీ ఘనీభవించి ఎలాంటి వికృతరూపాన్ని ధరిస్తాయో, శేఖరం వూహించలేకపోయాడు. దిమ్మెక్కిపోయిన తలను చేతుల్లోకి తీసుకొని కణతల్ని రుద్దుకుంటూ అతడు వసారాచివరిదాకా నడిచాడు. పాదాలు ముందుకు సాగడం లేదు. మళ్లీ వెనుదిరిగి వచ్చాడు. బెంచీపైన జగన్నాథంగారు లేరు. శేఖరం ద్వారం దగ్గరికి వెళ్లి లోపలికి చూచాడు. రెప్పపాటులేని కళ్లతో నాన్నగారు పైకప్పుకేసి చూస్తున్నారు. శేఖరం గది లోపలికి వెళ్లి నాన్నగారి చూపు కావేటట్టుగా నిల్చున్నాడు. లోతుకు పోయిన కళ్లల్లోంచి ఏకధారగా స్రవిస్తున్న కన్నీటితో వృద్ధుడి చెంపలు తడిసిపోతున్నాయి.

> పెద్దవాళ్ళతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వుండాలి అని వయసొచ్చిన కూతుర్ని మందలించేది అమె. ఒక రోజున ఒక పెద్ద మనిషి వచ్చాడు.
>
> "మీా కెవ్వళ్ళంటి?" అని అడిగింది కూతురు వినయంగా. అమె ప్రవర్తనను తల్లి సంతోషించింది. అయిన ఒక నిమిషం ఆగి "మా అమ్మా, నేనూ ఒక యీాడు వాళ్ళమేగ" అన్నాడు నవ్వుకుంటూ.
>
> నాలి క్కొరుక్కుంది తల్లి.

"నాన్నా!" హృదయం నుంచి వెలువడిన ఆర్తనాదంతో శేఖరం తండ్రిపైకి వ్రాలిపోయాడు.

ఎండుటాకుల్లాంటి పెదవులు చలించాయి. "వద్దు బాబూ వద్దు! నేను బ్రతకాలని కోరుకోవద్దు. శేఖరం! నన్ను చచ్చిపోనివ్వు. నేను దురాత్ముణ్ణి. పరమ కిరాతకుణ్ణి!" వాడిపోయిన తోటకూరకాడల్లాంటి చేతులతో శేఖరాన్ని రొమ్ముకు హత్తుకుంటూ వాపోతున్నారు కోదండరామయ్యగారు.

తండ్రి నోటంట అలాంటి మాటలు వినడానికి శేఖరాని కదే మొదటిసారి. ఆయన యింతకూ అంతకూ బెంబేలు పడిపోయేవాడు కాడనిగూడా శేఖరానికి తెలుసు. కట్టలు త్రెంచుకొని బయల్పడిన ఆ వృద్ధుడి శోకం వల్ల కొద్ది నిమిషాలకు మునుపు తనలో వేరూనుకున్న అనుమానం సత్యమే కావచ్చునని శేఖరానికి విస్పష్టంగా తెలిసిపోయింది. భూమ్యాకాశాలు ఒకదాని కొకటి చేరువగా వచ్చి మొదట తన తల, అందులోని మస్తిష్కమూ నలిగిపోతున్నట్టు ఓ విభ్రాంతి కలిగిం దతనికి. శేఖరం లేచి నిల్చున్నాడు. సూటిగా వృద్ధుడి కళ్లల్లోకి చూస్తూ, "నాన్నా! నాకు పిచ్చి పట్టడానికి ప్రారంభమై యింకా పది నిమిషాలు కాలేదు. మరి కొంతసేపట్లో అంత పనీ జరిగేటట్టే వుంది. నాకు నిజం కావాలి. అదెలాంటిదైనా సరే, అందువల్ల ఏం జరిగినా సరే నాకు నిజమే కావాలి" అన్నాడు.

శేఖరం చూపులకు తట్టుకోలేక పోయాడేమో, ముసలాయన రెండు చేతులతో ముఖాన్ని దాచుకున్నాడు. "భగవంతుడు సర్వ సమర్థుడు శేఖరం! ఏ మాటలు నా నోటి వెంట రాగూడదనుకున్నానో ఆ మాటలన్నీ తప్పనిసరిగా నా చేత పలికిస్తున్నాడు. నొప్పితో నా గుండె బద్దలయిపోయినా సరే, నేను నిజం చెప్పక తప్పదు. నేను గూడా ఈ బాధ నెంతోకాలం భరించలేను. ఒకానొక అనాథ శరణాలయం నుంచీ తీసుకొచ్చి పెంచుకొన్నానని చెబుతూ యింతకాలంగా నిన్ను, నీతోబాటు ప్రపంచాన్ని మోసగించాను. ఈ నాటితో నా పాపం బద్దలైంది. వెళ్ళు శేఖరం వెళ్ళు. వెళ్లి తలుపు

వేసెయ్. కిటికీలు మూసెయ్..."

శేఖరం చరాలున వెళ్ళి తలుపులు మూసి గడియ పెట్టేశాడు. కిటికీలు బంధించాడు. తిరిగి వచ్చి వృద్ధుడి పాదాలవైపున మంచం పైన కూర్చున్నాడు.

"చూచావా శేఖరం!" శోకరుద్ధమైనకంఠంలో మాటలు కొట్టుమిట్టాడి పోతున్నాయి. చిత్ర హింసకు గురిఅయిన తర్వాత అపరాధాన్ని బయట పెడుతున్న నేరస్థుడిలా ఆయన గిలగిలలాడి పోతున్నాడు. "మానవులు పాపకృత్యాలు చేస్తారు! చేస్తూ ఎవరూ చూడలేదనుకుంటారు. కానీ ఆ పాపాల తాలూకు పరిణామాలు ఎప్పుడో ఒక ప్పుడు నోరు విచ్చుకున్న భూతాల్లా యిలా పైకొచ్చేస్తాయని అనుకోరు. నా ఏడుపు నాకోసంగాదు శేఖరం! పాపం చేసిన వాణ్ణి నేను. దాని పరిణామాలకు బలైపోతున్నవాడివి నువ్వు. శేఖరం! భగవంతుడు నన్ను మన్నించలేడు. నువ్వు నన్ను మన్నించవు. చివరికి నన్ను నేనైనా మన్నించుకోలేను..."

లేచి కూర్చోడానికి విఫల ప్రయత్నాలుచేస్తూ ముసలాయన మళ్ళీ చెప్పుకుపోసాగాడు: "విను శేఖరం! పాతికేళ్ల క్రితం ఒకానొక రథసప్తమి నాటి అర్ధరాత్రి సమయాన నువ్వు నాకు దొరికావు. బయట వర్షం కురుస్తోంది. ఎక్కడో సమీపంలో పసిబిడ్డ ఏడుస్తున్నట్టు తోచింది. తలుపు తెరిచి చూచాను. వసారాలో పసినిసుగువి నువ్వుల క్రందిస్తున్నావు.ఎవరుతెచ్చారో తెలియదు, ఎందుకక్కడ దిగవిడిచి వెళ్లారో తెలియదు. అప్పటికి నేను రెండు పెళ్ళిళ్ళ చేసుకున్నాను. ఇద్దరు ఇల్లాళ్ళూ నన్నీ లోకానికి వదిలి, పరలోకాలకు వెళ్ళిపోయారు. అనాటికి నే నేకాకిని. భగవంతుడే నిన్ను నాకు అనుగ్రహించా డనుకున్నాను. కానీ తెల్లవారితే నిన్ను గురించి లోకానికి సంజాయిషీ చెప్పుకోక తీరదు. వందమైళ్లదూరంలో ఓ మారుమూల కుగ్రామంలో వుంది నా చెల్లెలు. ఎలాగో నిన్నక్కడికి చేర్చాను. నువ్వెవరినైతే అత్తయ్యగా భావిస్తున్నావో ఆ పార్వతమ్మకు పెంచిపెద్దచేయువలసిందని నిన్ను ఒప్పగించాను..."

ఆయాసంతో రొంగలు కార్చుకుంటూ, నరాల్ని గుంజివేస్తున్న ఉద్వేగంతో ఝంఝామారుతంలో సమూలంగా పెళ్లగింపబడిన వృక్షంలా సొమ్మసిల్లి పోయారు కోదండరామయ్యగారు.

చెవి గూబల్ని చీల్చివేసే భీషణారావంతో బ్రహ్మాండభాండం ప్రయ్యలు ప్రయ్యలై పోయిన తర్వాత ఏర్పడే స్తబ్ధత ఎలాంటిది? అలాంటి నిస్తబ్ధతలో రాతితో చేసిన విగ్రహంలా శేఖరం జడుడై పోయాడు. అతడి కళ్లకేమీ కనిపించడం లేదు. చెవుల కేమీ వినిపించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే అతడి జ్ఞానేంద్రియాలన్నీ స్తంభించి పోయాయి. అది జాగ్రదవస్థ గాదు. సుషుప్తిగూడా కాదు. స్వప్నం అసలే గాదు. పేరంటూ లేని ఆ నాలుగో అవస్థకు ఉపమానం ఒక్కటే—పగిలిపోయి లావాద్రవంతో తనను తానే అభిషేకించు కోడానికి ముందుగా అగ్నిపర్వతంలో కనిపించే నిశ్చలత్వం!

తలుపుపైన దబీదబీ మన్న శబ్దం ఎంత సేపటినుంచీ వినిపిస్తున్నదో శేఖరానికి తెలియదు. తెలిసిరాగానే అతడు తలుపు తెరచాడు. మొదట జగన్నాథంగారు, ఆయన వెనుక డాక్టరుగారు, బంధు సమూహం—అందరూ శేఖరం కేసి చిత్రంగా చూస్తున్నారు.

జగన్నాథంగారైతే తెల్లబోతున్నారు—"అదేమిటి శేఖరం! తలుపులన్నీ మూసేసి లోపలికి గాలిరాకుండా చేసుకుంటారా ఎవరైనా? డాక్టరుగారొచ్చారు. ఎంతసేపటి నుంచి పిలుస్తున్నా వినిపించడమే లేదు నీకు!"

అందరినీ లోపలికి రానిచ్చి శేఖరం బయటికి వచ్చేశాడు. రావడమేమిటి! ఎవరో మెడబట్టి గెంటుతున్నట్టుగా అతడు తూలిపోతూ ముందుకు సాగిపోతున్నాడు. నూకలూ, నువ్వులూ కలగలిపి పోసినట్టున్న వెలుగు చీకట్లలో పరిసర ప్రదేశమంతా శేఖరం కళ్ళ కిప్పుడు నాచుతో పాచితో నిండిన మురికినీటి వైతరణిలా కనిపిస్తోంది. తానొక ఓటి పడవ. ఈ పడవ కే మొచ్చింది? విపరీతమా, విపత్తా, వినాశమా, వచ్చిందేమిటి? ఆ వచ్చింది ఏం చేస్తోంది? బాకు తీసుకొని గుండెను కుమ్మివేస్తోంది. ఈ యాతన దుస్సహం. గత్యంతరం? పలాయనం. ఎక్కడికి? గుక్క తిప్పుకోగల చోటికి. చిల్లుల్లోనుంచీ చుక్కలు చుక్కలుగా నీళ్ళ పైకొచ్చి పడవ మునిగిపోతుండగా యింకెక్కడి గుక్కత్రిప్పుకోడం!

మహా ప్రవాహంలో ఎదురీత లాంటి భావ సంఘర్షణలో వూగిసలాడిపోతున్నాడు శేఖరం. తుళ్ళింతలతో పరుగెత్తుకుంటూ వచ్చిన నీడ లాంటి ఆ ఆకారం ఒకటి అల్లికాడల్లాంటి చేతులతో అతడి కాళ్లకు పెనవేసుకుంది.

"ఇక్కడేం చేస్తున్నావు బావా! రెండుబుట్టల నిండుకూ పువ్వులొచ్చాయి. తల్లో వుంచుకోడానికి కాదట! మంచాన్ని అలంకరిస్తారట! లోపలికిరా బావా!"

కుంచించుకుపోయిన శేఖరం ఫాలభాగంలో వంకర గీతలు మెలికలు తిరుగుతున్నాయి. అతడి పెదవులు ఒకదాని కొకటి అతుక్కున్నట్లు బిగుసుకున్నాయి. శస్త్ర చికిత్సకు ఓర్చుకుంటున్నట్టుగా పై పళ్ళ క్రిందిపళ్లతో బిగదన్నుకున్నాయి. బరువెక్కిన కనురెప్పలు క్రిందికి వ్రాలిపోయాయి. ఆ మౌనసికమైన మూర్ఛలో శేఖరానికి వట్టిమంచం కనిపిస్తోంది. మంచంపైన పట్టు పానుపు. దానిపైనపువ్వులు. చుట్టూరా వ్రేలాడుతున్న పూలసరాలు. క్షణాల్లో దృశ్యం మారిపోయింది. మంచంకాదు, అది మంటల పోవు. పానుపుగాదు, అది పాపకూపం. పువ్వులుకావు, అవి తేళ్ళూ, జెర్రులూ, పూల దండలుగావు, అవి బుసలు కొడుతున్న మిన్నాగులు. ఆ మంటలూ, ఆ తేళ్ళూ, ఆ పాములూ శేఖరాన్ని వెన్నంటుతున్నాయి. కాళ్లకు చుట్టుకున్న అరవింద బారెడు దూరానికి విసురుకుపోయింది. కార్చిచ్చులో తగులుకున్న లేడి కొదమలా శేఖరం పారిపోతున్నాడు.

శేఖరాన్ని ఆవరించిన తుఫాను హోరును చీల్చుకుంటూ వెనుకనుంచీ పిలుపు వినవస్తోంది. "శేఖరం! శేఖరం! ఆగు శేఖరం!" చిరపరిచితమైన కంఠంనుంచీ పురాతన సత్యంలా వినవస్తున్న ఆ పిలుపుగూడా శేఖరాన్ని ఆపలేకపోయింది. ఆగడ మెందుకు? మళ్ళీ ఆ మంటల్లోకి వెళ్ల డానికా? మళ్ళీ ఆ కాలసర్పాల మధ్య కొలువుదీర్చడానికా?....బెదరి, మనసు చెదరి, గుండె ప్రిదిలిపోతున్న శేఖరం వెనుదిరిగి చూడకుండా పరుగిడుతున్నాడు.

ఎంతదూరమని పరుగెత్తగలడు శేఖరం! అప్పటికే అతడు వూరుదాటి వచ్చేశాడు. ఎట్ట ఎదుట తంగేడు చెట్లతో నిండిన బంజరు బయలు. నడిచే ఓపిక నశించిపోగా అతడి పాదాలు గాలిలో తేలిపోతున్నాయి. గిరున తిరుగుతున్న కళ్లకు పుట్టలూ, మిట్టలూ, పొదలూ, చెట్లూ, అన్నీ ఒక్కలాగే కనిపిస్తున్నాయి. జిల్లుమని సోకిన చల్లటిస్పర్శతో అతడాగిపోయాడు. పాదాలక్రింద నీళ్ళ ప్రవహిస్తున్నాయి. కన్న తల్లి వాత్సల్యంలా కమ్మగానూ, కానుగచెట్టు నీడలా చల్లగానూ వున్న ఆ ఏటి నీటిని దోసిళ్లకొద్దికీ త్రాగేశాడు శేఖరం. పొగ లెగసిపోతున్న తలపైన, కుంపటిలా రగిలిపోతున్న రొమ్ముపైన యిన్ని నీళ్ళ చిలకరించుకున్నాడు. సలిల సేచనానికి శీతలవాయు స్పర్శ తోడై, లోలోపలి మానసికోద్వేగం కాస్త ఉపశమించగా అతడీవలకు వచ్చి యిసుక మేటపైన వ్రాలిపోయాడు.

ఆకసంలో చుక్కలు వెలుగుతున్నాయి. అంధ

## విధి విధానం

పేపరు చదువుకుంటూ కూర్చున్న తండ్రి దగ్గరకు హోంవర్కు చేసుకుంటూ కొడుకు వచ్చి—

"నాన్నా, నాన్నా, వింధ్య ఎక్కడ?" అని అడిగాడు.

తండ్రి తాపీగా—"మీ అమ్మను అడిగరా—ఎక్కడో పెట్టి మరిచిపోయి వుంటుంది. ఒఠి మతిమరుపు" అన్నాడు.

కాలంలో మిణుగురు పుర్వులు తిరుగుతున్నాయి. ఎక్కడో కొండలో పుట్టి, ప్రాణుల పిపాసార్తిని పోకార్చే మహా యజ్ఞంతో మనుగడను సఫలం చేసుకుంటూ మెల్లగా ప్రవహిస్తున్న కొండ యేటి ఏటి పాయవైపు చూస్తున్నాడు శేఖరం. నదులు పుట్టినచోటు, మహాత్ములు పుట్టిన చోటు తెలుసుకోవడం దుర్లభమంటారు! తనేమో నదీ కాదూ, మహాత్ముడూ కాదు. కానీ తన జన్మ రహస్యం తొట్టతొలి జీవితాధ్యాయపు చిరిగి పోయిన పుటలో అజ్ఞాతంగా వుండిపోయింది. తల్లి ఒడిలోని బిడ్డను చూచినప్పుడల్లా, తండ్రి భుజం పైకి ప్రాక నుంకిస్తున్న పసిపాపలను చూచినప్పుడల్లా తన ఆలోచనలు తల్లితండ్రుల పైకి వెళ్లేవి. ప్రపంచంలో ఎందరో దురదృష్టవంతు లున్నారు. వారిలో తన తలిదండ్రులెవరో తెలియని మానవు డెవడైతే వున్నాడో, వాడు దౌర్భాగ్యులలో కెల్లా దౌర్భాగ్యుడు. వాడి పాలిటికి ఈ కొరత జీవితాని కొక మాయని మచ్చగా, హృదయాని కొక ఎడతెగని మర్మాఘాతంగా నిలిచిపోతుంది. ఉన్నట్టుండి తాను ఆకాశంనుంచీ వూడిపడి వుండడు. ఈ భూతలంపైన ఎక్కడో తన తల్లితండ్రు లున్నారు. లేదా, వుండి వుంటారు. పుత్రుణ్ణి పున్నామనరకం నుంచీ ఉద్ధరించే పెన్నిధిగా భావిస్తారు తల్లి తండ్రులు. తమ నోముల పంట అనుకుంటారు. కానీ తల్లితండ్రులు మాత్రం మమకారాలను విడనాడి తనను తన రాతకొద్దికీ వదిలి పెట్టేశారు. ఎందువల్ల?

సమాధానం లభించని ప్రశ్నం నన్నింటినీ భగవల్లీలల క్రింద జమకట్టడం స్వభావం! ఆలోచించీ ఆలోచించీ తనూ ఆదే నిర్ణయానికి రాగలిగాడు. ఈ విశ్వం భగవంతుడి రసాయన శాల. ఇందులో కొత్త కొత్త పరిశోధనలు నిర్విరామంగా జరుగుతుంటాయి. వాటిలో ఒకానొక విచిత్రమైన పరిశోధనకు తను ముడి వస్తువుగా స్వీకరింపబడ్డాడు. ఐతే తల్లి తండ్రు లెవరో తెలియకపోవడంవరకూ ఈ పరిశోధన పరిమితమై వుండగలదని తాను భావించాడు. ఈ శిక్షతో తన పూర్వజన్మాల పాపాలు పరిహారం కాగలవనే అనుకున్నాడు. భగవంతుడి చిన్నచూపు ఇంకా ఇంకా తన జీవితంలోకి చొచ్చుకొనివస్తుందనీ, తనపైన పగబూనినట్టుగా ఆయన చేస్తున్న ఈ పరిశోధన మరింత తీవ్రతరం గావచ్చుననీ తనెన్నడూ అనుకోలేదు.

అనుకోనిదేదో, అనుకోడానికి వీల్లేనిదేదో అది జరిగింది. ఇంతకంటే తను పతితుడై వుంటే బాగుండేది. భ్రష్టుడై వుంటే బాగుండేది.....

తన ఆలోచనా వైఖరిపట్ల నిరసన ప్రకటిస్తూ ఛీత్కారం సలుపుకుంటున్న వాడిలా తలఅడ్డంగా త్రిప్పుతూ శేఖరం తటాలునలేచి కూర్చున్నాడు.—ఏమిటీ ఆలోచన? ఎవరిదీ తప్పు? చేజేతులా అపరాధం చేసి అంతా భగవంతుడి లీల అంటే ఎవడొప్పుకుంటాడు? ధర్మానికి గ్లాని జరిగివుంటే, మానవత్వానికి మచ్చ కలిగివుంటే అందుకు తాను కారకుడు గాకపోడు. వైదేహి వధువుగా, తాను వరుడుగా జరిగిన ఈ వివాహం తనతో నిమిత్తం లేకుండా జరిగిన కాకతాళీయమైన సంఘటన గాదు. వైదేహితో తనకు ఏడాదికి మించిన పరిచయం వుంది. మాటలూ, మనసూ కలిసిన తర్వాత తా నామెను ప్రేమించాడు. ప్రేమకు వెయ్యి నిర్వచనా లుంటే వుండ వచ్చునుగాక, తన ప్రేమలో పురుష సహజమైన వాంఛ లేదని తను గుండెలపైన చేయివేసుకొని చెప్పలేడు. కానీ ఒక్క విషయాన్ని గుండెలపైన చేయివేసుకొని క్రింది భూదేవిని, పైని ఆకాశవాణిని సాక్షులుగా పిలిచి చెప్పగలడు. మనిషిని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించేది మనస్సు. చెడుదారుల వెంట అది నల్లేరుపైన బండిలా ప్రసరిస్తుంది. కానీ వీలైనంతవరకూ మనసు కళ్ళాన్ని వదలిపెట్టకుండా, ఇంద్రియాశ్వాలను వాటి ఇచ్చకొద్దికీ వాటిని పరుగెత్తనివ్వకుండా నిరోధించడానికే తాను ప్రయత్నించాడు. మానవుణ్ణి పశువునుంచి వేరుచేసింది ఏదో, తల్లిదండ్రులనీ, అన్నదమ్ములనీ, అక్కచెల్లెళ్ళనీ, మానవాళికొన్ని విభజించి ఎవరెవరి ధర్మాలను వాళ్ళకు వేర్వేరుగా నిర్వచించినదేదో ఆ మానవత్వాన్ని తాను త్రికరణశుద్ధిగా గౌరవించాడు. ఆకర్షణలను అధిగమించి, ధర్మానికి అంటిపెట్టుకొని పడివుండగల నిష్ఠ తన రక్తంలో అంతర్గతమై వుంది. సముద్రుడు చెలియలికట్టను దాటటం లేదు. మిన్నులు విరిగి మీద పడటంలేదు. భౌతిక నేత్రాలకు గోచరం గాని వెయ్యి చీకటి తెరలు తనను చుట్టిముట్టితే ముట్టవచ్చునుగాక, తోబుట్టువును కామించే మహాపాపానికి తను ఒడిగట్టి వుండడు!

అసంభవం!

అరుణారుణ కాంతులు చిప్పిల్లుతూ శేఖరం కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. పిడికిలి బిగించి, ముఖంలో నరాలు ఉబ్బెత్తున పైకి లేస్తుండగా బిగ్గరగా అరుస్తున్నాడు శేఖరం—

"అసంభవం! అసంభవం!"

"శేఖరం! శేఖరం!" ధ్వనికి ప్రతిధ్వనిలా పిలుపు వినిపిస్తోంది.

భూదేవి పిలుపా! ఆకాశవాణి సాక్ష్యమా! ఎవరిదా పిలుపు! ఎందుకా పిలుపు! ఎవ్వరూ తనను క్షమించవద్దు! ఏ శబ్దమూ తనకు

## విరియించును మల్లెపూలు!

జనపాల బాల వెంకటరెడ్డి

హలం పట్టి నడిపిస్తే,
కదం తొక్కు నా హృదయం.
కలత లెక్క వైసప్పుడు,
విలపింతును కలకోసం.

అధం పథం ఎరుగనట్టి
అనఘుంచె అమిత మమత;
అనురాగం అందించే
ఆప్తులకై అంగలార్పు.

కళ్ళనీడు జాలువారు
కతలంటే కడు మక్కువ;
ప్రాణానికి ప్రాణ మిచ్చు
మిత్రులంటె ప్రేమ హెచ్చు.

తిండిలేని పేదవారి
ఎండిన కన్నీటి దారి
వెంట వెంట పోవాలని
మంట లెల్ల ఆర్పాలని

అవకాశం వీడనట్టు
ఆశతోడ వేచియుండు.

దరిదాపుల చేరినంత
విరియించును మల్లెపూలు.

వినిపించవద్దు! తాను నిదర్శనాలతో రుజువు చేయలేనిదీ, తన అంతఃకరణకు మాత్రమే అర్థమైనదీ అయిన ఈ సత్యాన్ని సత్యంగా నిరూపించగల మహాశక్తి ఏదైనా వుంటే అదిమాత్రమే తన కిప్పుడు ప్రత్యక్షం గావాలి!

లేకుంటే మనోబుద్ధ్యహంకారాలకు అతీతమైన ఆత్మ పదార్థ మేదైతేవుందో అది ఈ పాంచ భౌతిక శరీర కుడ్యాలను పెటిల్లు పెటిల్లుమని పెగలించుకొని అనంతవాయువుల్లోకి ఎగసి పోవాలి!

"శేఖరం!" చిరపరిచితమైన కంఠంనుంచి పురాతనమైన సత్యంలా నినదిస్తూ మళ్ళీ అదే పిలుపు.

శేఖరం పోల్చుకున్నాడు. ధనుర్ముక్తమైన బాణంలా చీకటిలో ఛాయామాత్రంగా కనిపిస్తున్న ఆకృతికి అభిముఖంగా పరుగెత్తాడు.

"అత్తయ్యా! ఈ ప్రపంచానికి నేను దూరమైనకొద్దీ నువ్వు నాకు దగ్గరౌతావా అత్తయ్యా! ఎలా వచ్చావు నువ్వు? నే నిక్కడున్నానని ఎలా తెలిసింది నీకు?"

బదులులేదు! శేఖరం నుదుట వేడివేడిగా అశ్రుబిందువులు మాత్రం వర్షిస్తున్నాయి.

"ఏడుస్తున్నావా అత్తయ్యా!" శేఖరం ఆమె పాదాలపైన వ్రాలిపోయాడు. "ఏడ్చి ఏం లాభ మత్తయ్యా! నే నడిగివచ్చిన రాత చిన్నది. తల్లి అంటే ఏమిటో ఎరుగను నేను. నీలో తల్లిని చూస్తున్నాను. నువ్వు కడుపు నిండుగా బిడ్డల్ని కన్నదానివి. నన్నూ కన్నబిడ్డలా చూచుకొన్న దానివి. నా మనసులోని మథనం ఒకరికి కనిపించేది కాదనుకున్నాను. నీకు కనిపించింది. కానీ ఏం లాభ మత్తయ్యా! ఎందుకొచ్చావు నువ్వు? వచ్చిమాత్రం నువ్వు చేయగలిగిం దేముంది?"

"శే...ఖ...రం!" కుప్పకూలలా పార్వతమ్మ యిసుకలో కూలిపోయింది.

కూలిపోయిన పార్వతమ్మ ఘోరున విలపిస్తూ శోక స్రవంతిగా కరిగిపోతోంది. తల్లి కడుపును చూచి తన రోదనాన్ని మానుకొన్న పసివాడిలా శేఖరం ఆమె చెంగట అప్రతిభుడై కూర్చుండి పోయాడు.

కాలం గడిచిపోతోంది.

చీరచెరగుతో శేఖరం కళ్ళలోని కన్నీటిని తుడిచివేస్తూ పార్వతమ్మ అతణ్ణి దగ్గరికి తీసుకొంది. "నాయనా శేఖరం! పాపిష్టిదాన్ని నేను. తప్పంతా నాది!"

శేఖరం పెదవులైతే కంపిస్తున్నాయి. మాటలు మాత్రం వెలువడడంలేదు.


"అవును బాబూ అవును! అన్నయ్యకు గుండెపోటు వచ్చింది. నయమౌతుంది లెమ్మను కున్నాను. మీ మామగారు నీతో మాట్లాడు తుండగా విన్నాను. నీ ముఖం వెలవెలపోతుండగా నా గుండెల్లో రాయి పడింది. నువ్వు గది లోపలికి

# విధి విధానం

వెళ్ళావు. నేను తలుపు వెనుక నిల్చున్నాను. అన్నయ్య నీతో పాతకథ చెబుతున్నాడు. లోపల నువ్వేమయ్యావో నాకు తెలియదు. బయట నేను గడగడ వడకిపోతున్నాను. నా ఒళ్ళు చల్లబడి పోయింది. అన్నయ్య చేసింది తప్పో ఒప్పో నాకు తెలియదు. ఆయన నిన్ను మన్నించమన్నాడు. ఆయన్నుకాదు శేఖరం! నువ్వు మన్నించ వలసింది నన్ను!" ఎంతో సంయమనంతో నిలవరించుకున్న దుఃఖం మళ్ళీ హద్దులు దాటిపోతోంది. "నా తప్పిద మేమిటో చెప్ప మంటావా శేఖరం! చెబుతున్నాను. నువ్వు నమ్మినా నమ్మకపోయినా యిది నిజం. అన్నయ్య నా కొక బిడ్డను తెచ్చి ఒప్పగించిన మాట నిజమే! కానీ నువ్వా బిడ్డవు కావు!"

చెరగులో ముఖం దాచుకొని, ముఖాన్ని మరోవైపుకు త్రిప్పుకుని రోదిస్తోంది పార్వతమ్మ.

"ఐతే నే నెవర్ని అత్తయ్యా? నే నెవర్ని?" రెండు చేతులతో పార్వతమ్మను కదిలించి



వేస్తూ అడుగుతున్నాడు శేఖరం. బొందిలో వుండనూలేక, బయట పడనూలేక లోలోపల కొట్టుమిట్టాడిపోతున్న జీవుడిలా అతడు విలవిల పోతున్నాడు.

"నువ్వు నా బిడ్డవి."

పాతికేళ్ళ నిజం వట్టి భ్రమగా మారి పోతున్న ఆక్షణాన శేఖరం బాహ్య ప్రపంచాన్నేగాక, తనను తానే విస్మరించాడు. నరాల్లో రక్త ప్రవాహం ఆగిపోయినట్టుగా, ఆ చల్లటి యిసుకపైన అతడు మంచుగడ్డలా బిగుసుకుపోయాడు.

"జరిగిం దిది శేఖరం! అన్నయ్య నా కా బిడ్డను తెచ్చి ఒప్పగించిన నాటికి నువ్వూ చంటిబిడ్డవి. కాలంతీరి—నాయింటికొచ్చిన నాలుగు మాసాల్లోనే ఆ బిడ్డ కళ్ళు మూసేశాడు. అన్నయ్యకు బోలెడు ఆస్తి పాస్తు లున్నాయి. అవన్నీ నాబిడ్డకే దక్కాలన్నది నా ఆశ. అన్నయ్య తిరిగివచ్చినప్పుడు నా బిడ్డ చనిపోయాడని చెప్పాను. వాడికి బదులుగా నిన్ను చూపించాను. ఆయన కనుమానం కలగలేదు. అలాగే కాలం దొర్లిపోయింది. నీకు నాలుగేళ్ళొచ్చాక అన్నయుకే నిన్ను తన దగ్గరికి తీసుకెళ్ళిపోయాడు. నువ్వక్కడే పెరిగి పెద్దవాడివయ్యావు..."

చీకట్లను తరిమివేస్తూ పూర్వ దిగ్భాగంలోకి వ్యాపిస్తున్న వెన్నెల వెలుగులకేసి చూస్తున్నాడు శేఖరం. ఇంతలో చీకటి! అంతలో వెలుగు! కాలంలాగే మానవుడి జీవితం గూడా వెలుగు చీకట్ల పడుగు పేక. వెలుగులో వున్నంతకాలం మానవుడికి తన బ్రతుకు వసంతంగానూ, యిహమే స్వర్గంగానూ భాసిస్తుంది. చీకటి ముంచుకొచ్చినప్పుడు అందుకు విరుద్ధంగా బ్రతుకు నిదాఘమనీ, ఈ లోకం నరకమనీ అనిపిస్తుంది. ఋతు భేదాలు గూడా తన మోద ఖేదాలకు అనుగుణంగానే ప్రవర్తిల్లు తున్నాయనీ అనుకోగలుగుతున్న మానవుడు నిజంగా అమాయకుడు!

ఎక్కడి వెలుగు! ఎక్కడి చీకటి! ఒకే వస్తువులో ఓ వైపున వెలుగు, మరో వైపున చీకటి. ఒకే సంఘటనకు ఓ వైపున కష్టం, మరో వైపున సుఖం. దేని కది విడివిడిగా విభజించడానికి వీల్లేని ద్వంద్వాల కలయిక ప్రపంచం.

శేఖరాని కిప్పుడు మోదమూ లేదు. ఖేదమూ లేదు. అతని నిప్పుడు జీవిత రహస్యాన్ని ఆకళించుకొని నిర్వికారదశలోకి వచ్చిన స్థితప్రజ్ఞుడనైనా చెప్పుకోవచ్చు. లేదా చెదరి పోయిన ఆహార్యాన్ని సరిదిద్దుకొని మళ్ళీ రంగంపైకి సిద్ధమైన నటుడనైనా చెప్పుకోవచ్చు!

శేఖరంలోని శేఖరత్వానికి సెగి లేకపోయిన తర్వాత తనను గురించి ఏమని చెప్పుకున్నా శేఖరానికి నష్టమయ్యేదేమీ లేదు! ★